క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


కృపా కీర్తన

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తిక్కిరెడ్డి కృపాకీర్తన రాష్ట్ర స్థాయి ఉమెన్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల పీడీ గొలకోటి వీరేంద్ర ఆదివారం తెలిపారు. కీర్తన గుంటూరు జిల్లా నరసారావుపేటలో ఈ నెల 29 నుంచి 31 వరకూ జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో అండర్–17 బాలికల విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరఫున ఆడనుంది. ఈ సందర్భంగా కీర్తనను హెచ్ఎం లంకా రాజీ, పీఎంసీ చైర్మన్ రమావెంకటరమణ, పీడీలు డి.నరసన్న, వి.విజయభాస్కర్ అభినందించారు.

మంత్రి విశ్వరూప్ అభినందన


వరప్రసాదును సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: జిల్లా ఐటీ విభాగం కార్యదర్శిగా నియమితులైన వరప్రసాద్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఐటీ రంగంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వరప్రసాద్‌కు ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు వంగా గిరిజాకుమారి, కొంబే ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇమామ్ అలీ గంధోత్సవం


అమలాపురం దర్గాలో గంధోత్సవంలో పాల్గొన్న షియా ముస్లింలు

అమలాపురం టౌన్: షియా ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త తమ్ముడైన ఇమామ్ అలీ పుట్టినరోజును పురస్కరించుకుని అమలాపురంలో షియాలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక 12వ వార్డులోని అస్నాలీ అబ్బాస్ పంజాకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన షియా ముస్లింలు ర్యాలీలో పాల్గొన్నారు. ముస్లింవీధి, ఖ్వాజాబాబా దర్గా, తలవర్గ వారి వీధి, ముమ్మిడివరం గేటు సెంటరు మీదుగా అలీ కరిమల్లాహ దర్గాకు ర్యాలీ చేరుకుంది. భక్తి గీతాలు పాడుతూ గంధోత్సవాన్ని ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. మహ్మద్ నిస్సార్ హుస్సేన్, కర్రార్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

హాస్టల్‌కు టీవీల బహూకరణ


హాస్టల్‌లో టీవీని ప్రారంభించిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అమలాపురం రాజా ఎముకల హాస్పటల్ డాక్టర్ రాజా 55 ఇంచుల రెండు ఎల్ఈడీ టీవీలను ఆదివారం బహూకరించారు. ఈ టీవీలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావులు ప్రారంభించారు. డాక్టర్ రాజా సేవా తత్పరతను వారు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యన్నాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, చాంబర్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, దాత డాక్టర్ రాజా పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఈఈకి సత్కారం


ఈఈ రవికుమార్‌ను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

అమలాపురం రూరల్: విద్యుత్ అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా గణతంత్ర దినోత్సవం రోజున జీఎంసీ బాలయోగి స్టేడియంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఏపీఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్‌ను ఉద్యోగ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆయనను అభినందించినవారిలో ఏపీయు ఎ.ప్రసాద్, అప్పారి పాపారావు, వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు ఆకుల రమేష్, నెల్లి సత్యనారాయణ, ఎండీ రమణ, బొంతు శ్రీనివాస సోమశేఖర్, సాకా రామారావు, బొంతు సాయి, ఎ.రాజారత్నం తదితరులున్నారు.

పంట పండినట్టే..

- ఈ–క్రాప్‌తో అన్నదాతలకు మేలు
- ముమ్మరంగా నమోదు చేస్తున్న యంత్రాంగం
- వచ్చే నెల 15తో ముగియనున్న గడువు


చొల్లంగి పంచాయతీలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు

తాళ్లరేవు: వ్యవసాయ రంగంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువచ్చింది. దీనిలో ప్రధానమైనది రైతులకు కొండంత అండగా ఉండే ఈ–పంట విధానం. దీనిద్వారా విత్తు నుంచి మొదలు.. ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయించే వరకూ అన్ని రకాలుగా ఆసరాగా నిలుస్తుంది. పంట నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా తదితర సౌకర్యాలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పొందేందుకు ఈ–క్రాప్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఈ విధానంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి, ఎవరు, ఏ పంట సాగు చేశారన్న విషయాన్ని సమగ్రంగా నమోదు చేస్తున్నారు. వ్యవసాయ ఉద్యాన పంటలైన వరి, పండ్లు, కూరగాయల తోటలు ఇలా ప్రతి ఒక పంట నమోదవుతున్నాయి. రైతులు సాగు చేసిన పొలంలోకి వ్యవసాయ సిబ్బంది స్వయంగా పరిశీలించి, ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, పకడ్బందీగా నమోదు చేస్తున్నారు. పంటల నమోదులో అన్ని జాగ్రత్తలు తీసుకుని, ఈ–క్రాప్ విధానం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు దీనిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పంటల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు జిల్లా ఉన్నతాధికారులు తనిఖీలు కూడా నిర్వహిస్తున్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకూ తనిఖీల్లో పాల్గొంటున్నారు.

ప్రయోజనాలివే..

ఈ–క్రాప్‌లో నమోదైతే బ్యాంకుల ద్వారా సులువుగా పంట రుణాలు పొందవచ్చు. వైఎస్సార్ సున్నా వడ్డీకి అర్హత సాధించేందుకు వీలుంటుంది. ఎలాంటి ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంట బీమా పొందవచ్చు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పంటకు పరిహారం పొందవచ్చు. ధరల పతనం సమయంలో కనీస మద్దతు ధరతో వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునే అవకాశం ఉంటుంది. పంట నమోదు కారణంగా ప్రభుత్వం ద్వారా అందే రాయితీలు, పరిహారాలు, లబ్ధి కోల్పోతారని వ్యవసాయ శాఖ అధికారులు.. రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

> **ఫిబ్రవరి 15లోగా నమోదు చేయించాలి**
>
> 
>
> ఈ ఏడాది దాళ్వా (రబీ) పంటకు సంబంధించి ప్రభుత్వం ఈ–క్రాప్ నమోదుకు వచ్చే నెల 15వ తేదీ వరకు గడువు ఇచ్చింది. పంట సాగు చేస్తున్న ప్రతి రైతు విధిగా ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకుని సిబ్బందికి సహకరించాలి. ఇప్పటివరకు తాళ్లరేవు మండలంలో 60 శాతం మేర ఈ–క్రాప్ పూర్తయ్యింది. ఈ–క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అందుతాయి.
>
> – ఎస్.ప్రశాంతి, ఏఎంఓ, తాళ్లరేవు మండలం

> **ఈ విధానం చాలా బాగుంది**
>
> 
>
> ప్రభుత్వం ప్రారంభించిన ఈ–పంట విధానం చాలా బాగుంది. నేను చొల్లంగి పంచాయతీలో సుమారు 4 ఎకరాలు సాగు చేస్తున్నాను. ఈ–క్రాప్ విధానం ద్వారా నా పంటను యాప్‌లో నమోదు చేయడం వల్ల విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై లభించాయి. పంట రుణం తో పాటు, ఏదైనా నష్టం జరిగితే పరిహారం ఇస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.
>
> – స్వర్ణ వీరరాజు, రైతు, చొల్లంగి పంచాయతీ

ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయికి ఆరు జట్ల ఎంపిక


జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన తాళ్లరేవు మండల జట్టు

తాళ్లరేవు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో తాళ్లరేవు మండలం నుంచి ఆరు జట్లు గ్రామీణ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. మండలం నుంచి పురుషుల విభాగంలో కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ జట్లు వెళ్లగా, మహిళల విభాగం నుంచి బ్యాడ్మింటన్, ఖోఖో జట్లు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయన్నారు. రెండు జట్లు రన్నర్సప్‌గా నిలిచాయన్నారు. పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందిని ఎంపీడీఓ అభినందించారు.

అక్రమ మద్యం పట్టివేత

ఐ.పోలవరం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాలతో యానాం వంతెనకు సమీపంలోని ఎదుర్లంకలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న 11 మందిని అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, రెండు మోటారు సైకిళ్లు, 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీలకు సంబంధించి ఐ.పోలవరం, ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్లలో 7 కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో ట్రైనీ డీఎస్పీ ఏ.విష్ణు స్వరూప్, ఐ.పోలవరం ఎస్ఐ సీహెచ్.రాజేష్ పాల్గొన్నారని చెప్పారు.

గొల్లవిల్లిలో..

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లిలో ఓ కూరగాయల దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఎం.సాంబశివరావును ఎస్ఐ కె.మోహోరజోషి ఆదివారం పట్టుకుని అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఫిజికల్ డైరెక్టర్ మృతి

అమలాపురం రూరల్: మండలంలోని పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పనిచేస్తున్న జల్లి మహాలక్ష్మయ్య(37) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన నగ్గరాములపల్లె గ్రామస్తుడు. పి.గన్నవరం మండలం ఊడిమూడిలో ఆయన భౌతికకాయాన్ని పీఈటీ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు జార్జి సందర్శించి నివాళులర్పించారు. మహాలక్ష్మయ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

క్రమశిక్షణతో చదివితే విజయం తథ్యం

విజయవాడ డీసీపీ సత్తిబాబు


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీసీపీ సత్తిబాబు

పి.గన్నవరం: విద్యార్థులు క్రమశిక్షణతో, సరైన అవగాహనతో చదివితే గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షల్లో విజయం సాధించవచ్చని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. మండలంలోని చాకలిపాలెం కృష్ణబాలాజీ కన్వెన్షన్ హాలులో ఆదివారం శ్రీచాటకుంట్ల ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ట్రస్టు చైర్మన్ మోకా రమాదేవి సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను సత్తిబాబు 120 మంది నిరుద్యోగ, ఉద్యోగార్థులకు అందించారు. రాజోలు జెడ్పీటీసీ మట్టా శైలజ మాట్లాడుతూ డీసీపీ సత్తిబాబు కులమతాలకతీతంగా పేదవారిని పేద విద్యార్థులకు సాయం అందించి, ఉద్యోగులుగా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మట్టా సత్తిబాబు, నెల్లి సత్యనారాయణ, మోకా సత్యం, సాల్మ శ్రీధర్, తాడి శేఖర్, ప్రదీప్, గూటం సాయి, దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కబడ్డీ విజేత బెల్లంపూడి

పి.గన్నవరం: జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీల్లో పి.గన్నవరం మండలం బెల్లంపూడి గ్రామ సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. సెమీ ఫైనల్లో అంబాజీపేట మండలానికి చెందిన జట్టుపై, ఫైనల్‌లో అయినవిల్లి మండలానికి చెందిన జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచింది. దీంతో బెల్లంపూడి జట్టు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించిన ఈ జట్టుకు ప్రభుత్వం రూ.35 వేలు, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేయనుంది. ఈ టీమ్‌ను బెల్లంపూడి సర్పంచ్ బండి మహాలక్ష్మి, మహాలక్ష్మి ట్రస్టు చైర్మన్ బండి రమేష్ తదితరులు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఆలమూరు: యర్ర కాలనీలో నిర్మిస్తున్న సత్తెమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆలమూరు మండలానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త వైట్ల దుర్గారావు రూ.30 వేల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఆలయ నిర్మాణం వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు సమక్షంలో ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆదివారం ఆ విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం సమీపంలోని చెక్క రూపంలో ఉన్న అమ్మవారి విగ్రహానికి దుర్గారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ వానంశెట్టి దుర్గాభవానీ, అనుసూరి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలను చేయడమే లక్ష్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి
- పేపర్ ప్లేట్ల యూనిట్ ప్రారంభం


అమలాపురంలో పేపర్ ప్లేట్స్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: స్వయం సహాయ సంఘాలకు ఆర్థిక చేయూతనిచ్చి మహిళలను పారిశ్రామికవేత్తలను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా కృషి చేస్తుందని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక 25వ వార్డులోని సీతాపతిరావుపేట శ్రీసిద్ధి సాయి స్వయం సహాయక మహిళా సంఘం, పట్టణ మహిళా సమాఖ్య సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రగతి పేపర్ ప్లేట్ల యూనిట్‌ను చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి ఆదివారం ప్రారంభించి ప్రసంగించారు. రూ.1.60 లక్షల వ్యయంతో మహిళా సంఘం సభ్యులకు కుడుపూడి సుజాత ఈ యూనిట్‌ను నెలకొల్పారన్నారు. స్వయం శక్తితో మహిళా సంఘం, పట్టణ మహిళా సమాఖ్య ఏర్పాటుచేసిన ఈ యూనిట్‌ను అందరం ప్రోత్సహించి వారి జీవనోపాధికి తోడ్పాటునివ్వాలని చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యన్నాయుడు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి, 25వ వార్డు కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పట్టణ మహిళా సమాఖ్య రిసోర్స్ పర్సన్ పాము శ్యామల, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, 30 వార్డుల ఆర్పీలు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఐడీఏ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ఐడీఏ జిల్లా శాఖ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న డాక్టర్ రామకృష్ణంరాజు

అమలాపురం రూరల్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మండలంలోని బండారులంక ఎన్ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగింది. అమలాపురం కేంద్రంగా అసోసియేషన్ జిల్లా శాఖ కొత్తగా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. జిల్లా అధ్యక్షుడిగా అమలాపురం దంత వైద్య నిపుణుడు డాక్టర్ బీహెచ్‌వీ రామకృష్ణంరాజుతో పాటు 25 మంది నూతన కార్యవర్గ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. డాక్టర్ రామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకార సభకు ఐడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నామినేని కిరణ్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అజయ్ బెనర్జీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎస్ ఎస్ మూర్తి, కార్యదర్శి డాక్టర్ కడలి ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా నూతన కార్యవర్గం చేత రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లాలో ఐడీఏ శాఖ ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణంరాజును ఐఎంఏ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మూర్తి, డాక్టర్ ప్రసాద్ అభినందించారు. జిల్లా అసోసియేషన్ కార్యదర్శిగా డాక్టర్ డి.సత్య సునీల్, కోశాధికారిగా డాక్టర్ జి.గణపతి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బీఎస్ఎన్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ ఎస్.మురళీ కృష్ణంరాజు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక


వెంకట పద్మగురునాయుడు


కొనుకు రత్నంరాజు

అల్లవరం: మండల ఎస్టీయూ అధ్యక్ష కార్యదర్శులుగా సంద్యాల వెంకట పద్మగురునాయుడు, కొనుకు రత్నంరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అల్లవరం అభ్యుదయ పాఠశాలలో ఆదివారం జరిగిన ఎస్టీయూ మండల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాబ్జీ అక్ష, జెడ్పీటీసీ సభ్యులు కొనుకు గౌతమి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి చెన్నంశెట్టి రంగారావు, జిల్లా కార్యదర్శిగా తోట బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కడలి నాగగణేష్, యాళ్ల జ్యోతికుమార్, గుత్తుల వెంకటేశ్వరరావు, కోరుమిల్లి ప్రభాకర విశ్వనాథ్, కుసుమ రమేష్, రామయణం వెంకట సత్యనారాయణ, మాల దివాకర్, బొంతు శశిప్రకాష్‌లను ఎంపిక చేశారు. వారిని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఉపాధ్యాయులు అభినందించారు.

రామ మందిరం నిర్మాణంతో ప్రపంచ ఖ్యాతి

కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నారాయణస్వామి


అమలాపురంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి నారాయణస్వామి

అమలాపురం రూరల్: అయోధ్యలో రామ మందిరం నిర్మించడంతో ప్రపంచ దేశాలన్నీ భారతదేశాన్ని కీర్తిస్తున్నాయని కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నారాయణస్వామి అన్నారు. ఆదివారం అమలాపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయానికి విచ్చేసిన మంత్రి నారాయణస్వామి పాత్రికేయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమి ఆదిలోనే విచ్ఛిన్నమైందని ఎద్దేవా చేశారు. బీహార్ సీఎం నితీష్‌కుమార్ తిరిగి ఎన్డీఏలో చేరడం ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు నిదర్శనమన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో బుద్ధగ, జంగా, రెండు జాతులకు ఎస్సీ హోదా కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే డీఏలు, అలవెన్సులు ప్రభుత్వ ఉద్యోగులకు సక్రమంగా అందడం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా అధ్యక్షుడు వెంకట రామోహనరావు(దొరబాబు), మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మోకా వెంకట సుబ్బారావు, యక్కల సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, ఆదబాల సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి పాట్నూరు రామ్మోహనరావు, రాజేష్, చిట్టూరి రాజేశ్వరి, కొండేటి ఈశ్వర్ గౌడ్, అరిగెల తేజ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పర్యటనలో ఘర్షణ

కేంద్రమంత్రి నారాయణస్వామి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతుండగా ఆయన్ని కలిసేందుకు వచ్చిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ బంధువైన రెల్లుగడ్డ గ్రామానికి చెందిన నార్ని శ్రీరాములు అక్కడకు వచ్చారు. గతంలో పవన్‌కుమార్, నార్ని శ్రీరాములు మధ్య భూవివాదం ఉంది. ఈ నేపథ్యంలో నువ్వు ఇక్కడెందుకు వచ్చావంటూ శ్రీరాములును పవన్‌కుమార్ ప్రశ్నించారు. కేంద్రమంత్రి పర్యటనలో వివాదం ఎందుకని అక్కడున్న బీజేపీ నాయకులు వారించారు. అదే సమయానికి నల్లా పవన్‌కుమార్‌తో బంధువైన రంకిరెడ్డి రామలింగేశ్వరరావు వచ్చి శ్రీరాములును అక్కడి నుంచి వెళ్లాలని చెప్పారు. దీంతో వారిద్దరి మధ్య ఘర్షణ రేగింది. పవన్ అనుచరులు సైతం అక్కడకు చేరుకోవడం వివాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు శ్రీరాములును బలవంతంగా పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎటువంటి ఫిర్యాదు లేకపోవడంతో కేసు నమోదు చేయకుండా అతడిని వదిలిపెట్టారు.

ధర్మ యుద్ధానికి విద్యార్థి లోకం సిద్ధం


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య

ముమ్మిడివరం: రానున్న ఎన్నికల్లో దుష్ట చతుష్టయంపై ధర్మ యుద్ధానికి విద్యార్థి లోకం సిద్ధంగా ఉందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య పేర్కొన్నారు. ముమ్మిడివరంలో ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మెండగుదిటి శిరీష్, రీజనల్ కోఆర్డినేటర్ నీలి ఆనందు అధ్యక్షతన జగన్నన్న కాలేజ్ కెప్టెన్స్ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యారంగంలో నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకూ ప్రయాణం, బైలాంగ్వేజ్ పాఠ్యపుస్తకాలు, బైజూస్ కంటెంట్‌ను విద్యార్థులకు అందించారన్నారు. ఐబీ పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, ఐబీ తెరిచే సరికి విద్యాకానుక, గోరుముద్ద, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక భారం లేకుండా చేశారన్నారు. ప్రతి పేద విద్యార్థికి ఉచితంగా ఉన్నత చదువులు అందించేలా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

కామాక్షి పీఠంలో పిల్లలకు యోగా శిక్షణ


పిల్లలకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న గురువు డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షి పీఠంలోని ప్రేమ మందిరం అనాథ పిల్లలకు యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆదివారం ఉదయం యోగాభ్యాసనాలపై శిక్షణనిచ్చారు. పీఠాధిపతి కామేశ్వ మహర్షి సూచనలతో పిల్లల చేత పలు యోగాసనాలు వేయించారు. యోగా చేయడం వల్ల ఆరోగ్య సమస్యలను ఎలా జయించవచ్చో డాక్టర్ శ్రీనివాస్ పిల్లలకు వివరించారు. శిక్షణా కార్యక్రమాన్ని పీఠాధిపతి కామేశ మహర్షి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. అనంతరం యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్‌ను పీఠాధిపతి ఆశీర్వదించారు.

ఉత్తమ సేవకులకు ఘన సత్కారం


సంజీవరెడ్డిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న ఆలమూరు పంచాయతీ కార్యదర్శి కె.సంజీవరెడ్డిని ఘనంగా సత్కరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెల్లూరి లావణ్య కుమార్ రాజా, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు తదితరులు మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా కార్యదర్శి సంజీవరెడ్డి గ్రామస్తులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని వారు ఆకాంక్షించారు. గ్రామ సచివాలయ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఎంఈఓ సాలెరాజుకు సత్కారం

స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ పి.సాలెరాజు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా సత్కారం జరిగింది. జేబీపేట ఆవలాదరం(?)లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్న సాలెరాజును ఎస్టీయూ మండల శాఖ ప్రతినిధులు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహ పునరావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని పునరావిష్కరించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: వెదిరేశ్వరం గ్రామంలో తీర్చిదిద్దిన రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం పునరావిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఈ దేశానికి చేసిన మేలును, నిర్మించిన రాజ్యాంగాన్ని, చేసిన త్యాగాలను చిర స్థాయిగా గుర్తుండిపోయేలా విజయవాడలో నిర్మించిన 206 అడుగుల ఆయన విగ్రహం, స్మృతివనమే తార్కాణమన్నారు. మన పిల్లలు ఈ రోజు, ఇలా చదువుకుంటున్నారంటే, తన కూనస(?) సభ సభ్యత్వమైనా అంబేడ్కర్ కృషి ఫలితమేనన్నారు. ఆయన ఆశయాల కోసం అణగారిన వర్గాల పక్షాన ఎల్లప్పుడూ నిలబడతానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, జి.రమాదేవి, సర్పంచ్ బొక్కా కరుణాకరం, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, కోనాల రాజు, వైసీ తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. చండీగఢ్ జ్యుడీషియల్ సభ్యుడు పీఎస్ఎన్ ప్రసాద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ (సీఏఓ) పోలీస్ ఆఫీసర్ సి.గోవిందరాజు, బాలబాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన బాలాజీ స్వామిని దర్శించుకున్న అనంతరం అర్చకుల నుంచి మహదాశీర్వచనం అందుకున్నారు. వారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ గంధం మాధవి స్వామివారి శేష వస్త్రం అందించారు. అలాగే స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యుడు చిట్టాల సత్తిబాబు, ఉప ప్రధానార్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.